సాక్షి
కామారెడ్డి

బుధవారం । 31 । జూలై । 2024



అర్థమయ్యేలా బోధించాలి

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని, వారి సామర్థ్యాలను పెంపొందించాలని డీఈవో ఉపాధ్యాయులకు సూచించారు.

- 11లో ▸



బోనమెత్తిన గ్రామాలు

జిల్లాలోని పలు ప్రాంతాలలో ఘనంగా బోనాల పండుగను నిర్వహించారు. గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు.

- 11లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.6 /23.7

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

మెట్లబావి ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభం



లింగంపేట: మండల కేంద్ర సమీపంలోని చారిత్రక కట్టడమైన నాగన్నగారి మెట్ల బావి చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులను మంగళవారం ఎంపీడీవో నరేష్ ప్రారంభించారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఈనెల 18న మెట్ల బావిని సందర్శించారు. బావి చుట్టూ ప్రహరి, రోడ్లు నిర్మించాలని, విద్యుత్ దీపాలు అలంకరించాలని సూచించారు. దీంతో పంచాయతీరాజ్ డీఈఈ గిరి బావి చుట్టూ ప్రహరి నిర్మాణ పనులకు మార్కింగ్ ఇచ్చారు. ప్రహరి నిర్మాణం అనంతరం మిగతా పనులు చేపడతామని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో మలహరి, కార్యదర్శి శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

1, 2 తేదీల్లో డైట్‌సెట్ సర్టిఫికెట్ల పరిశీలన

కామారెడ్డి అర్బన్: డైట్ కళాశాలలో ప్రవేశం కోసం వచ్చేనెల 1, 2 తేదీల్లో సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని నిజామాబాద్ డైట్ కాలేజీ ప్రిన్సిపల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. డీఈఈ సెట్‌లో ఉత్తీర్ణులైన తెలుగు, ఉర్దూ, ఇంగ్లిష్ అభ్యర్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కావాలని పేర్కొన్నారు. నాలుగో తరగతి నుంచి ఇంటర్ వరకు బోనఫైడ్ సర్టిఫికెట్లు, పదో తరగతి, ఇంటర్ మార్కుల జాబితాలు, ఇటీవల పొందిన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను వెంట తీసుకుని రావాలని సూచించారు.

బుంగ పూడ్చివేత



సాక్షి ఎఫెక్ట్..

లింగంపేట: నల్లమడుగు శివారులోని నేలమత్తడికి ఏర్పడిన బుంగను మంగళవారం పూడ్చివేశారు. సోమవారం 'సాక్షి'లో 'నల్లమడుగు నేల మత్తడికి బుంగ' శీర్షికన ప్రచురితమైన వార్తపై నీటిపారుదల శాఖ అధికారులు స్పందించారు. నీటిపారుదల శాఖ డీఈఈ వెంకటేశ్వర్లు ఆదేశాలతో వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ మంగళవారం బుంగను పరిశీలించారు. రైతులతో కలిసి బుంగను పూడ్చివేసి, అవసరమైన మరమ్మతులు చేయించారు.

ఎస్సారెస్పీలోకి తగ్గిన వరద

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు తగ్గుముఖం పట్టింది. క్రితం రోజు 17 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. మంగళవారం ఉదయం నుంచి 22వేల క్యూసెక్కులకు పెరిగింది. తర్వాత క్రమంగా తగ్గుతూ సాయంత్రానికి 12వేల క్యూసెక్కులకు పడిపోయింది. ప్రాజెక్టు నుంచి సరస్వతి కాలువ ద్వారా 10 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 433 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80 టీఎంసీలు) కాగా మంగళవారం సాయంత్రానికి ప్రాజెక్టులో 1076.3 అడుగుల(35.7 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు.

'ఆర్టీసీ డ్రైవర్ల తప్పులుంటేనే కేసులు పెట్టాలి'



ఖలీల్‌వాడి: ఆర్టీసీ డ్రైవర్ల తప్పులుంటేనే కేసులు నమోదు చేయాలని సీపీ కల్మేశ్వర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయంలో ఆర్టీసీ డ్రైవర్లపై గల కేసుల గురించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఆర్టీసీ డ్రైవర్లపై కేసులు నమోదు చేసేటప్పుడు పూర్తి స్థాయి విచారణ జరిపిన తర్వాత కేసు నమోదు చేయాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు సూచించారు. కార్యక్రమంలో డీసీపీ బి.కోటేశ్వర రావు, ట్రాఫిక్ ఏసీపీ టి. నారాయణ, ఆర్టీసీ ఆర్ఎం కె.జానీరెడ్డి, డిప్యూటీలు ఆర్ఎం వి.శంకర్, డిపో మేనేజర్లు ఎస్. ఆనంద్, పి.రవికుమార్, ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నబోతున్న సర్కారు బడి

రామారెడ్డి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో 2021-22 సంవత్సరంలో 437 మంది విద్యార్థులు ఉండగా.. 2022-23 లో విద్యార్థుల సంఖ్య 257 కు పడిపోయింది. 2023-24 సంవత్సరంలో 219 మంది మాత్రమే ఉండగా.. ఈ విద్యాసంవత్సరంలో ఈ సంఖ్య 201 కి తగ్గింది. నాలుగేళ్లలో విద్యార్థుల సంఖ్య సగానికి తగ్గడం గమనార్హం.

నాగిరెడ్డిపేట మండలంలోని బంజారతండా ప్రాథమిక పాఠశాలలో గతేడాది 34 మంది విద్యార్థులు ఉన్నారు. ఈసారి ఆ సంఖ్య 25కు తగ్గిపోయింది. విద్యార్థుల సంఖ్య తగ్గుతూ పోతే పాఠశాల మూతపడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఒకప్పుడు వందలాది మంది విద్యార్థులతో కళకళలాడిన సర్కారు బడులు.. క్రమంగా అస్తిత్వాన్ని కోల్పోతున్నాయి. ఉపాధ్యాయుల కొరతకు తోడు సరైన సౌకర్యాలు లేకపోవడంతో చాలామంది విద్యార్థులు ప్రైవేట్ స్కూళ్ల బాట పడుతున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ విద్యాసంవత్సరంలో జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య సుమారు 8 వేలు తగ్గడం ఆందోళన కలిగిస్తోంది.

- ఏటా తగ్గిపోతున్న విద్యార్థుల సంఖ్య
- ఒకటో తరగతిలో మరీ అధ్వానం
- ప్రభుత్వ పాఠశాలల భవిష్యత్తుపై నీలినీడలు



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: జిల్లాలో గత విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో 76,537 మంది విద్యార్థులు చదువుకున్నారు. ఈసారి 68,687 మంది మాత్రమే ఉన్నారు. ఏడాది కాలంలో సుమారు ఎనిమిది వేల మంది విద్యార్థులు తగ్గిపోయారు. ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య వేగంగా పడిపోతోంది. ఏటా కొన్ని బడులు మూతబడుతున్నాయి. జిల్లాలో 653 ప్రాథమిక పాఠశాలలు ఉండగా.. గతేడాది ఒకటో తరగతిలో 7,903 మంది విద్యార్థులు ఉన్నారు. ఈసారి వారి సంఖ్య 4,247 కు పడిపోయింది. అంటే 3,656 మంది విద్యార్థులు తగ్గారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలు కనుమరుగయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

జిల్లాలోని ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య..

పాఠశాల స్థాయి	పాఠశాలల సంఖ్య	2023-24	2024-25
ప్రాథమిక	653	32,793	28,112
ప్రాథమికోన్నత	124	9,817	8,894
ఉన్నత	190	33,927	31,681
మొత్తం	967	76,537	68,687

విద్యార్థులు వస్తేనే..

రాష్ట్ర ప్రభుత్వం మూతబడిన పాఠశాలలను కూడా తెరవాలని ఆదేశించింది. విద్యార్థులు వస్తే టీచర్లను సర్దుబాటు చేస్తామని అధికారులు అంటున్నా.. టీచర్లను నియమించకుండా పిల్లలను పంపడానికి తల్లిదండ్రులు ముందుకు రావడం లేదు. దీంతో చాలాచోట్ల మూతబడిన బడులు తిరిగి తెరుచుకునే పరిస్థితి కనిపించడం లేదు.

ఉనికి ప్రశ్నార్థకం!

ప్రభుత్వ పాఠశాలల్లో ఏటా అడ్మిషన్లు తగ్గిపోతుండడంతో వాటి ఉనికి ప్రశ్నార్థకంగా మారుతోంది. కొన్ని పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరేవారే కనిపించడం లేదు. దీంతో రాబోయే సంవత్సరాల్లో ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోయి బడి మూతబడే ప్రమాదం ఉంది. పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేకపోవడం, ఉపాధ్యాయుల కొరత మూలంగా ప్రభుత్వ పాఠశాలలపై నిరాసక్తత ఏర్పడుతోంది. మామూలు కుటుంబాలకు చెందిన వారు కూడా తమ పిల్లలకు మంచి చదువు చెప్పించాలని కోరుకుంటున్నారు. ప్రభుత్వ బడుల్లో వారు కోరుకున్న విధంగా సౌకర్యాలు దొరక్కపోవడంతో చాలామంది అప్పులు చేసి మరీ తమ పిల్లలను ప్రైవేటు బడులకు పంపిస్తున్నారు. అవకాశం దొరికిన వారు గురుకుల పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే పిల్లల సంఖ్య పడిపోతోంది.

ప్రకటనలకే పరిమితం..

సర్కారు బడుల్లో మౌలిక వసతులు కల్పిస్తామని పాలకులు చెబుతున్న మాటలు.. ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. సౌకర్యాల కల్పన కోసం కొత్త పేర్లతో పథకాలను ప్రకటిస్తున్నా.. అవి పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. గతంలో 'మన ఊరు -మన బడి' కార్యక్రమం పేరుతో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకున్నారు. అయితే ప్రభుత్వం మారడంతో 'అమ్మ ఆదర్శ పాఠశాల' పేరుతో కొత్త కార్యక్రమాన్ని చేపట్టింది. మౌలిక సదుపాయాల కల్పనకు కొంతమేర నిధులు మంజూరు చేసినా పనులు అసంపూర్తిగానే మిగిలాయి. దీంతో ఆయా పాఠశాలల్లో చదువుతున్న పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ



రైతులకు చెక్కు అందిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- రైతులకు రెండో విడత మాఫీ చెక్కుల అందజేత

కామారెడ్డి క్రైం: అర్హులైన రైతులందరికీ పంట రుణాల మాఫీతో ప్రయోజనం చేకూరుతుందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం ఆవరణ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి రెండో విడత రుణమాఫీని ప్రారంభించారు. కలెక్టరేట్‌నుంచి వర్చువల్ విధానంలో కలెక్టర్ సంగ్వాన్‌తోపాటు రైతులు, వ్యవసాయ, సహకార శాఖల అధికారులు, బ్యాంకర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 25 రైతు వేదికల్లో రుణ మాఫీ మలివిడత నిధుల విడుదల కార్యక్రమం కొనసాగిందన్నారు. ప్రభుత్వం ఈనెల 18న మొదటి విడతలో రూ.లక్ష లోపు పంట రుణాలను మాఫీ చేసిందని, జిల్లాలో మొదటి విడతలో 49,540 మంది రైతు కుటుంబాలకు రూ. 231 కోట్ల మేర లబ్ధి చేకూరిందని పేర్కొన్నారు. మంగళవారం రెండో విడతలో రూ.1.50 లక్షలలోపు రుణాలను మాఫీ చేసిందని, 24816 మంది రైతు కుటుంబాలకు రూ. 211 కోట్లు అందనున్నాయని తెలిపారు. మలివిడత రుణమాఫీ నిధులు రెండు రోజుల్లోగా రైతుల ఖాతాల్లో జమ అవుతాయన్నారు. రుణమాఫీ విషయంలో ఇబ్బందులు ఉంటే వాటిని పరిష్కరించేందుకు జిల్లా స్థాయిలో సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే తొలివిడత మాఫీకి సంబంధించి 1,209 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు రుణమాఫీ ప్రయోజనం పొందేలా బ్యాంకర్లు, వ్యవసాయ అధికారులు సహకారం అందించాలని ఆదేశించారు. రుణమాఫీలో ఏవైనా సమస్యలు ఉంటే 72888 94616 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. అనంతరం పలువురు రైతులకు రెండో విడత రుణమాఫీకి సంబంధించిన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, డీఏవో భాగ్యలక్ష్మి, ఎల్‌డీఎం రవికాంత్, సంబంధిత శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

'ఆసియా చెస్ బాక్సింగ్'లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

బాన్సువాడ/పిట్లం: పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని ఖుదీరాం అనుశీలన్ కేంద్రంలో ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు జరిగిన చెస్ బాక్సింగ్ పోటీలలో జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. ఆసియా చెస్ బాక్సింగ్ చాంపియన్‌షిప్, ఇండియన్ ఓపెన్ ఇంటర్నేషనల్ చెస్ బాక్సింగ్ టోర్నీలో తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించి తొమ్మిది పతకాలను సొంతం చేసుకున్నారు. సీనియర్ మహిళా విభాగంలో పిట్లం మండల కేంద్రానికి చెందిన ప్రతిభ ఐదు బంగారు పతకాలు సాధించగా.. సీనియర్ పురుషుల విభాగంలో ఆమె సోదరుడు విజయ్ రాఘవేంద్రరావు రెండు రజత పతకాలను సొంతం చేసుకున్నాడు. సబ్ జూనియర్స్ విభాగంలో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి మనవడు రుషాంక్‌రెడ్డి రెండు బంగారు పతకాలను సాధించాడు. పతకాలు సాధించిన విజయ్ రాఘవేంద్రరావు, రుషాంక్‌రెడ్డిలకు ప్రతిభనే శిక్షణ ఇవ్వడం గమనార్హం.



మెడల్స్ చూపుతున్న రుషాంక్‌రెడ్డి, ప్రతిభ, విజయ్ రాఘవేంద్రరావు

బీసీలను మోసం చేసిన ప్రభుత్వం



కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న స్వామి యాదవ్

- బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి స్వామి యాదవ్ ఆరోపణ

కామారెడ్డి క్రైం: ఎన్నికలకు ముందు బీసీ డిక్లరేషన్ పేరిట హామీలు ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బీసీ విద్రోహ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టి బీసీలను మోసం చేసిందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి స్వామి యాదవ్ విమర్శించారు. బీసీలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించకపోవడాన్ని తీవ్రంగా నిరసిస్తూ బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కలెక్టరేట్ ఎదుట బైఠాయించి దాదాపు గంట పాటు ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ పాలనాధికారి మస్రూర్ అహ్మద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా స్వామి యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అంటేనే నమ్మించి మోసం చేసే పార్టీ అని మరోసారి ఈ బడ్జెట్ ద్వారా రుజువైందన్నారు. బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయడానికి అవసరమైన రూ.50 వేల కోట్లను కేటాయించి అసెంబ్లీ సమావేశాల్లో బడ్జెట్ సవరణలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థులకు చేయూత, గొల్లకుర్మలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ, ఫీజు రీయింబర్స్‌మెంట్, మత్స్యకారులకు ప్రత్యేక కార్పొరేషన్ తదితర డిమాండ్‌లను వెంటనే పరిష్కరించాని కోరారు. ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు తోట బాల్‌రాజ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'మోడల్' ఉపాధ్యాయుల బదిలీలెప్పుడో..?

- పదకొండేళ్లుగా ఒకే చోట విధుల నిర్వహణ
- బదిలీల ప్రక్రియ చేపట్టాలని కోరుతున్న టీచర్లు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): దశాబ్ద కాలంగా ఒకేచోట విధులు నిర్వహిస్తున్న తమను వెంటనే ఇతర పాఠశాలలకు బదిలీ చేయాలని మోడల్ స్కూళ్ల ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లాలో 2013లో అప్పటి ప్రభుత్వం మోడల్ స్కూళ్లను ప్రారంభించింది. పాఠశాల ప్రారంభించినప్పుడు నియమితులైన ఉపాధ్యాయులు చాలామంది అప్పటి నుంచి ఒకేచోట విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, అచ్చంపేట, మేనూర్, సదాశివనగర్, కొత్తబాదిలలో మోడల్ స్కూళ్లు ఉన్నాయి. ఒక్కో పాఠశాలలో 18–20 మంది పీజీటీలు, టీజీటీలు ఏళ్ల తరబడి ఒకేచోట విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టడంతో తమను సైతం బదిలీ చేయాలని మోడల్ స్కూళ్ల ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు.

కుటుంబాలకు దూరం..

మోడల్ స్కూళ్లలో విధులు నిర్వహించే ఉపాధ్యాయులకు సంబంధించి జోనల్ పోస్ట్ కావడంతో చాలామంది పదేళ్లుగా కుటుంబాలకు దూరంగా ఉంటున్నారు. ఈ కారణంగా చాలామంది ఆరోగ్యంగా ఇబ్బందులు పడుతున్నారు. దీంతోపాటు ఆర్థికంగా కూడ చితికిపోతున్నట్లు వారు వాపోతున్నారు. కొందరు ప్రతిరోజూ 80–100 కిలోమీటర్ల దూరం ప్రయాణించి పాఠశాలకు చేరుకొని అలసిపోతున్నారు.

గతేడాది షెడ్యూల్ విడుదల చేసినా..

మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న పీజీటీ, టీజీటీలను బదిలీ చేసేందుకు గతేడాది జూన్‌లో అప్పటి ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ మేరకు పీజీటీ, టీజీటీలు వెబ్‌ఆప్షన్లు ఇచ్చిన తర్వాత కొంతమంది ఉపాధ్యాయులు బదిలీల ప్రక్రియపై కోర్టులో కేసు వేయడంతో ఆఖరి నిమిషంలో బదిలీల ప్రక్రియకు బ్రేక్ పడింది. దీంతో బదిలీలపై ఎన్నో కలలు కన్న మోడల్ స్కూళ్ల ఉపాధ్యాయుల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పూర్తి చేయడంతో మోడల్ స్కూళ్ల సిబ్బందిలోనూ బదిలీలపై మళ్లీ ఆశలు చిగురించాయి. ఏళ్ల తరబడి ఒకే చోట విధులు నిర్వహిస్తున్న తమను సైతం మరో చోటుకు బదిలీ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

చుక్క నీరు ఇచ్చేది లేదు

- అవసరమైతే ఉద్యమం చేస్తాం
- అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు ఆయకట్టు రైతులు



కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేస్తున్న అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు ఆయకట్టు రైతులు

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలో నెలకొంటున్న తాగునీటి సమస్య పరిష్కారం కోసం సమీపంలో ఉన్న అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్ద చెరువు నుంచి నీటిని తరలించేందుకు మున్సిపల్ యంత్రాంగం ప్రయత్నాలు ప్రారంభించడాన్ని ఆయకట్టు రైతులు వ్యతిరేకించారు. చెరువు నుంచి చుక్క నీరు కూడా ఇచ్చే ప్రసక్తే లేదనీ, తమ పొట్టగొట్టే పనులు మానుకోవాలని చెరువు ఆయకట్టు పరిధిలోని 9 గ్రామాల రైతులు మంగళవారం కలెక్టరేట్‌కు తరలివచ్చారు. వారు మాట్లాడుతూ.. అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువుపై ఆధారపడి 9 గ్రామాలకు చెందిన చిన్న, సన్నకారు రైతులు పంటలు పండించుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. 30 శాతం నీరు వాడుకోవడానికి కామారెడ్డి బల్దియా నుంచి ఇరిగేషన్ అధికారులకు ప్రతిపాదనలు పెట్టారని అన్నారు. దాదాపు 2,100 ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. అదే జరిగితే రైతుల పంటలకు నీరు సరిపోక రైతుల కుటుంబాలు వీధిన పడాల్సి వస్తుందన్నారు. కామారెడ్డిలో నీటి ఎద్దడి నివారణకు గోదావరీ జలాల పైప్‌లైన్ సౌకర్యం మరింతగా పెంచడం గానీ, కామారెడ్డి పెద్ద చెరువు పూడికతీతలు తీసుకోవడం ద్వారా సామర్థ్యాలను పెంచడం గానీ చేయాలన్నారు. అంతే గానీ అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు జోలికి వస్తే సహించబోమని స్పష్టం చేశారు. గతంలో మాస్టర్ ప్లాన్ రద్దు కోసం ఉద్యమ బాట పట్టిన నేపథ్యాన్ని గుర్తు చేశారు. ఈ విషయంలో కూడా ఎంతవరకైనా ఉద్యమిస్తామన్నారు. జిల్లా కేంద్రంలో నీటి ఎద్దడి నివారణ విషయంలో ఇతర మార్గాలు చూసుకోవాలని స్పష్టం చేశారు. కామారెడ్డి బల్దియా యంత్రాంగం తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమబాట పడుతూ తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

'సీఎం ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు'

బాన్సువాడ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ పంట రుణాలను మాఫీ చేస్తున్నారని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. రెండో విడత రుణమాఫీ సందర్భంగా మంగళవారం బాన్సువాడలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం నియోజకవర్గానికి చెందిన 187 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులకు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు, మున్సిపల్ చైర్మన్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



రాహుల్, రేవంత్ చిత్ర పటాలకు పాలాభిషేకం చేస్తున్న పోచారం, కాసుల

క్లుప్తంగా

వారం రోజుల్లో కాల్వ పనులు ప్రారంభిస్తాం



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని నీటిపారుదల శాఖ కాల్వ పనులు వారం రోజుల్లో ప్రారంభిస్తామని నీటి పారుదల శాఖ డీఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు. పెద్దవాగు నుంచి వచ్చే మత్తడి కాల్వ ప్రమాదకరంగా మారడంతో ఆయన మంగళవారం పరిశీలించారు. డెయిలీ మార్కెట్ పక్కనే ఉన్న కాల్వ పూడికతో నిండిపోయి మురికి నీటితో దుర్వాసన వెదజల్లుతుండడంతో గ్రామస్తులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కాల్వ నిర్మాణంతో పాటు కల్వర్టు నిర్మాణం చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపినట్లు ఆయన పేర్కొన్నారు. ఎంపీడీవో నరేష్, శ్రీకాంత్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాగౌడ్ తదితరులున్నారు.

విద్యార్థులకు అవగాహన కార్యక్రమం



కామారెడ్డి అర్బన్: మానవ అక్రమ రవాణ, షీటీం, సైబర్ క్రైమ్, బాల్య వివాహాలు, రోడ్డు భద్రత, మత్తు పదార్థాలపై చైతన్యపరుస్తూ మంగళవారం స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఎహెచ్‌టియు) పోలీసు కళాబృందం అవగాహన కార్యక్రమం చేపట్టింది. అత్యవసర పరిస్థితుల్లో షీటీం నంబర్ 8712686094, 100, 108, 181 నంబర్లతో పాటు సైబర్ నేరాలపై 1930 నంబర్‌కు వెంటనే కాల్ చేయాలని ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, అధికారి రాజేందర్‌లు సూచించారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రిన్సిపల్ శిరీష, కళాబృందం సభ్యులు ప్రభాకర్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి పట్టణంలోని అంబేడ్కర్ స్టడీ సెంటర్‌లో అంబేడ్కర్ యూనివర్సిటీలో డిగ్రీ చేసేందుకు అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కో–ఆర్డినేటర్ జయప్రకాష్ మంగళవారం తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఆగస్టు 18లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఎల్లారెడ్డి స్టడీ సెంటర్‌లో బీఏ, బీకాం, బీఎస్సీ గ్రూపులకు సంబంధించి కోర్సులు ఉన్నాయన్నారు. ఇంటర్మీడియట్, ఓపెన్ ఇంటర్, డిప్లొమా, ఐటీఐ చేసిన వారు అర్హులని అన్నారు. మరిన్ని వివరాలకు 9491004792కు సంప్రదించాలన్నారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో తొమ్మిది మంది ఎంపిక



భిక్కనూరు: తెలంగాణ విశ్వవిద్యాలయంలో దక్షిణ ప్రాంగణంలో నిర్వహించిన జాబ్ మేళాలో 9 మంది జియో ఇన్ఫర్మేటిక్స్ విద్యార్థులు ఎంపికయ్యారు. పీజీ పూర్తి చేసిన, పీజీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు తెలంగాణ విశ్వవిద్యాలయం ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ సెల్,డిపార్ట్‌మెంట్ ఆఫ్ జియో ఇన్ఫ ర్మేటిక్స్ విభాగం సంయుక్తంగా నిర్వహించిన జాబ్ మేళాలో జియో స్పెషల్ డేటా ఎనలిస్ట్ ఉద్యోగాల కోసం 35 మంది రిజిస్టర్ చేసుకోగా 9 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. క్యాంపస్ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ అధికారి డాక్టర్ పాత నాగరాజు మాట్లాడుతూ.. రానున్న రోజులలో ప్రైవేటు రంగంలో ఉద్యోగాలకు అత్యధిక డిమాండ్ ఉంటుందని అన్నారు. రానున్న కాలంలో మరిన్ని కంపెనీలతో మాట్లాడి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని విద్యార్థులు సిద్ధంగా ఉండాలని అన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్ గౌడ్, కో–ఆర్డినేటర్స్ పాల్గొన్నారు.

గణితంతో గమ్మత్తులు

- కఠినమైన గణిత శాస్త్రాన్ని సులభంగా నేర్పిస్తున్న రామకృష్ణ
- అంక గణితం, రీజనింగ్‌లో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ
- సౌత్ ఇండియా విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలో ఉత్తమ ప్రదర్శన



అప్పటి కలెక్టర్ జితేష్ చేతుల మీదుగా దశాబ్ది ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకుంటున్న రామకృష్ణ

కామారెడ్డి రూరల్: లెక్కలు అనగానే దిక్కులు చూస్తూ పక్కకు పెడుతుంటారు చాలామంది పిల్లలు. నేటి తరం విద్యార్థులలో సైతం ఈ భయం అలాగే వెంటాడి ఒక ఫోబియాగా మారింది. చాలా మంది విద్యార్థులు గణితం అనేది ఒక కఠినమైన సబ్జెక్టుగా భావిస్తూ పోటీ పరీక్షలకు, ఉద్యోగాలకు దూరమవుతున్నారు. ఇటువంటి విద్యార్థులకు చిన్నతనం నుండే సులభ పద్ధతులను ఉపయోగించి ఆడుతూ పాడుతూ గణితాన్ని నేర్పిస్తున్నారు ఒక ఉపాధ్యాయుడు. అతనే కామారెడ్డి మండలం చిన్న మల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు విజయగిరి రామకృష్ణ. విద్యార్థుల చిట్టిబుర్రలకు కఠిన అంశాలను సైతం సులభమైన పద్ధతిలో బోధిస్తున్నారు. విద్యార్థులలో గణిత అభిరుచిని పెంపొందించడానికి మన ప్రాచీన వేద గణితం, అబాకస్ లాంటి పద్ధతులు కూడా ఉపయోగించి బోధన చేస్తున్నారు. వివిధ పోటీ పరీక్షలకు అవసరమైన అంక గణితం, రీజనింగ్ వంటివి జోడించి తన బోధన మరింత విద్యార్థులకు ఉపయుక్తమయ్యేలా చేస్తున్నారు.

సాధన చేస్తే గణితం సులభం..

చిన్నతనం నుంచే తన తండ్రి విశ్రాంత ఉపాధ్యాయుడు అయిన నారాయణ దగ్గర నుంచి గణితంలోని వివిధ మెలకువలను నేర్చుకొని పట్టు సాధించాడు. డిగ్రీ చదువుకుంటున్న రోజుల నుంచే విద్యా బోధన మొదలుపెట్టారు. ఇంటర్, ఎంసెట్ తరగతులతో పాటు బ్యాంకు, రైల్వే లాంటి పోటీ పరీక్షలకు సైతం ప్రత్యేక శిక్షణ ఇచ్చేవారు. ఆయనే కాకుండా ఆయన పాఠాలు బోధించిన విద్యార్థులు సైతం అనేక రంగాల్లో రాణిస్తున్నారు.



పరికరాలతో బోధన చేస్తూ..

కళలు, సాహిత్య రంగంలో సైతం..

పదవ తరగతి విద్యార్థుల కోసం విజయ పథం, గణితంతో గమ్మత్తులు పుస్తకాలను రచించారు. విద్యార్థులకు పరీక్షలపై అవగాహన ఇస్తూ ప్రతి సంవత్సరం వార్తాపత్రికల్లో మోటివేషనల్ సందేశాలు ఇస్తున్నారు.

పలు సత్కారాలు, పురస్కారాలు..

- 2022లో జిల్లా స్థాయిలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ఉపాధ్యాయ ఉత్తమ ప్రదర్శనగా సైన్స్ ఫెయిర్ అవార్డును పొంది రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు.
- 2024 ఫిబ్రవరిలో గుజరాత్‌లోని ఐఐటీ గాంధీనగర్‌లో జరిగిన జాతీయస్థాయి 'క్రియేటివ్ లెర్నింగ్ గణిత వర్క్ షాప్'లో మాస్టర్ ట్రైనర్‌గా పాల్గొని ప్రశంసా పత్రం పొందారు.
- 2024 జనవరిలో ఫరీదాబాద్–ఢిల్లీలో జరిగిన 33 దేశాల విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు, ఇస్రో బృందం పాల్గొన్న ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు ప్రత్యేక ఆహ్వానం పొంది అక్కడ ప్రతిభను ప్రదర్శించారు.
- 2022 డిసెంబర్‌లో నిర్మల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక, పర్యావరణ పరిరక్షణ షోలో పాల్గొని రాష్ట్రస్థాయి పురస్కారం పొందారు.
- 2023లో కేరళలో జరిగిన సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో గణిత ఉపాధ్యాయ ప్రాజెక్టు అత్యుత్తమ ప్రదర్శన అవార్డు పొంది ఇస్రో బృందం దృష్టిని ఆకర్షించారు. అంతే కాకుండా 2002, 2005, 2012లలో పని చేసిన వివిధ మండలాలలో మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందారు.
- 2022లో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, 2023లో కలెక్టర్ చేతుల మీదుగా దశాబ్ది ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందారు.
- 2023లో మినిస్ట్రీ ఆఫ్ కల్చర్ ఇండియా వారు నిర్వహించిన జాతీయ నూతన విద్యా విధానం 2020 సదస్సులో 'ఉత్తమ గణిత సేవ పురస్కారం' పొందారు. 2023 స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా స్థాయిలో 'ఇన్నోవేటివ్ టీచర్' అవార్డు పొందారు. అంతే కాకుండా ప్రపంచంలోని ఏ దేశ విద్యార్థులకైనా ఒలంపియాడ్ విద్యాబోధన చేయడానికి అనుమతించే 'ఇంటర్నేషనల్ ఒలంపియాడ్ టీచర్', 'గ్లోబల్ మ్యాథమాటిక్స్ టీచర్' గా వీరు సర్టిఫికేషన్‌లను సాధించారు.

భయాన్ని వీడితే మంచి ఫలితాలు



విద్యార్థులు ముందుగా గణితం అంటే భయాన్ని వదిలి పెట్టాలి. క్రమం తప్పకుండా ప్రాక్టీస్ చేస్తే గణితం మన వశం అవుతుంది. విద్యార్థి దశలో పట్టుదలతో ఏది నేర్చుకున్నా ఇట్టే పట్టేయవచ్చు. ప్రత్యేక శ్రద్ధ పెడితే గణితం కన్నా సులువైంది ఏదీ లేదు. విద్యార్థులకు అబాకస్‌తో పాటు జియో జీబ్రాలో నిష్ణాతులుగా చేయాలని కోరుకుంటున్నా. –విజయగిరి రామకృష్ణ, గణిత శాస్త్ర విషయ నిపుణుడు

తాగునీటి ఇబ్బందులు

- వారంలో రెండు సార్లు మాత్రమే మంచి నీటి సరఫరా
- పట్టించుకోని అధికారులు



తాగు నీటి కోసం గుమిగూడిన గ్రామస్తులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): బ్రహ్మాజీవాడిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని గ్రామస్తులు వాపోయారు. వారంలో రెండు సార్లు మాత్రమే నీటి సరఫరా అవుతోందన్నారు. అధికారులు మాత్రం చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో రెండు మంచి నీటిట్యాంకులు ఉన్నాయి.. ఎన్నడూ ఆ ట్యాంకులు నిండిన దాఖలాలు లేవు.. ప్రతి సోమవారం, పండుగ రోజులలో నీళ్ల కోసం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. మిషన్ భగీరథ పైపుల ద్వారా సరిగా నీరు రావడం లేదు. గ్రామానికి చెందిన రెండు బోరుబావులు ఉన్నప్పటికి వాటికి సంబంధించిన మోటార్లు కాలిపోయాయన్నారు. అప్పడప్పుడు మిషన్ భగీరథ ద్వారా గ్రామంలో ఉన్న మినీ ట్యాంకులోకి నీళ్లు వస్తాయన్నారు. ఆ ట్యాంకు వద్దకు వెళ్లి బిందెలు, డబ్బాలలో నీళ్లను నింపుకొని మోసికెళ్తున్నామన్నారు. నీళ్ల కోసం చాలా సమయాన్ని కేటాయించవలసి వస్తోందన్నారు. వర్షాకాలంలోనే ఇంత తాగునీటి సమస్య ఉంటే రానున్నరోజులలో ఎంత ఇబ్బంది పడాల్సి వస్తుందోనని గ్రామస్తులు భయపడుతున్నారు.

పౌష్టికాహారంపై అవగాహన



కామారెడ్డి అర్బన్: 'బాలింతలు, శిశువుల ఆరోగ్యం'పై కామారెడ్డి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రాజీవ్‌నగర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అవగాహన కల్పించారు. అలాగే పౌష్టికాహారం అందజేశారు. గర్భిణులు, బాలింతలు ప్రతిరోజు పండ్లు, కోడిగుడ్లు, కూరగాయలు, ఆకుకూరలు ఆహారంలో భాగం చేసుకోవాలని, మాతా, శిశువు సంరక్షణ జాగ్రతలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు పి.రాజనర్సింహారెడ్డి, కార్యదర్శి కే.సత్యనారాయణ, కోశాధికారి సబ్బని కృష్ణహరి తదితరులున్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



అంబులెన్స్‌లో బాధితులు

వర్ని: ద్విచక్ర వాహనానికి నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి అడ్డువచ్చిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. వర్ని పోలీస్ స్టేషన్ పరిధిలోని జలాల్‌పూర్ గ్రామ శివారులో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది.సాలూర గ్రామానికి చెందిన సిద్ధు, హేమ ద్విచక్ర వాహనంపై బడాపహాడ్ వెళ్తుండగా, నడుచుకుంటూ వెళ్తున్న ఆరిఫ్ అనే వ్యక్తి అడ్డువచ్చాడు. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలుకాగా, చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్‌షాక్‌తో మహిళకు ..




గాయాలపాలైన సురేఖ

వర్ని: విద్యుత్‌షాక్ తగిలి మండలంలోని బేలియానాయక్ తండాకు చెందిన అజ్మీరా సురేఖకు తీవ్రగాయాలయ్యాయి. మంగళవారం ఉదయం సురేఖ ఇంటిపై బట్టలు ఆరేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఆమెను వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఇళ్ల పైనుంచి ఉన్న విద్యుత్ తీగలను తొలగించాలని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని, వారి నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

గంజాయి కేసులో ముగ్గురి అరెస్ట్

భిక్కనూరు: గంజాయి కేసులో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా గుట్ట పక్కతండాకు చెందిన సకర్వాల్ హరిసింగ్ గంజాయి తీసుకొని మండలంలోని బీటీఎస్ వద్దకు సోమవారం అర్ధరాత్రి రాగా, దానిని కొనుగోలు చేసేందుకు బీబీపేట మండలం తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన రోహిత్‌గౌడ్, బీబీపేట మండలం యాడారంకు చెందిన వడ్ల వంశీ అక్కడికి వచ్చారు. పక్కా సమాచారం మేరకు అక్కడికి చేరుకొని ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారించగా వారి వద్ద గంజాయి లభించిందని ఎస్సై తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.3,375 ఉంటుందని, రెండు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజుల జ్యుడీషల్ కస్టడీ విధించారని, నిజామాబాద్ జైలుకు తరలించామని ఎస్సై తెలిపారు.

దొంగల ముఠా అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

బాన్సువాడ: బీర్కూర్, నస్రుల్లాబాద్, కోటగిరి మండలాల పరిధిలో సర్వీస్ వైర్లు, బావి దగ్గర మోటార్లు, సెంట్రింగ్ డబ్బాలు మొదలైనవి దొంగతనం చేసిన ముఠాను అరెస్టు చేసినట్లు సీఐ సత్యనారాయణ గౌడ్ తెలిపారు. మంగళవారం బీర్కూర్ పోలీస్ స్టేషన్‌లో బీర్కూర్‌కు చెందిన ఏడు కొండలు, గోపనపల్లి పాషా, అరుణ్ అనే ముగ్గురు వ్యక్తులను హాజరు పరిచారు. వారి నుంచి దొంగిలించిన సొత్తును రికవరీ చేశారు. నిందితులను బాన్సువాడ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి రిమాండ్ చేసి నిజామాబాద్ జైలుకు పంపారు.

వనమహోత్సవాన్ని సక్సెస్ చేయాలి



చిట్యాల ప్రభుత్వ పాఠశాలలో మొక్కలను నాటుతున్న రాజారాం



మొక్కలు నాటుతున్న ప్రత్యేక అధికారి విజయ్

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి రాజారాం అన్నారు. తాడ్వాయి మండలంలోని చిట్యాల, సంతాయిపేట్ గ్రామాల్లో మంగళవారం ఎంపీడీవో సాజీద్‌అలీతో కలసి పర్యటించారు. చిట్యాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. మెన్ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందించాలని సూచించారు. అలాగే సంతాయిపేట్‌లోని అంగన్ వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అలాగే డంపింగ్ యార్డులను ఉపయోగించుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో సయ్యద్ సాజీద్ అలీ, ఉపాధ్యాయులు, గ్రామ కార్యదర్శులు, కారోబార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నిజాంసాగర్(జుక్కల్) : జీపీల వారిగా లక్ష్యం మేర మొక్కలు నాటి వన మహోత్సవాన్ని జయప్రదం చేయాలని మండల ప్రత్యేక అధికారి విజయభాస్కర్ సూచించారు. మంగళవారం మండలంలోని గోర్గల్ గ్రామంలో ఈజీఎస్ ఆధ్వర్యంలో వన నర్సరీలో మొక్కలు నాటారు. ఎంపీడీవో గంగాధర్, ఎంపీవో అనిత, ఏపీవో శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అక్రమ అరెస్ట్‌లను ఖండిస్తున్నాం



మాట్లాడుతున్న సీఐటీయూ నేత చంద్రశేఖర్

కామారెడ్డి రూరల్ : ధర్నాలో పాల్గొనేందుకు హైదరాబాద్ వెళ్తున్న ఆశాలు, జీపీ కార్మికులను అరెస్టులకు పాల్పడటాన్ని సీఐటీయూ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. కామారెడ్డిలో సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ మంగళవారం మాట్లాడుతూ కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ఆశాలకు రూ.18 వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు ఇవ్వాలన్నారు. వారికి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నర్సింలు, నాయకుడు రాజనర్సు పాల్గొన్నారు.

దోమకొండలో..

దోమకొండ : సీఐటీయూ ఆధ్వర్యంలో జీపీ కార్మికలను ఆశ వర్కర్ల 'చలో హైదరాబాద్' కార్యక్రమం నిర్వహించగా మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. మండలంలో జీపీ కార్మికులను, ఆశవర్కర్లను అక్రమంగా అరెస్ట్ చేసినట్లు సీఐటీయూ జిల్లా నాయకులు నాగారపు ఎల్లయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్మికులు నిమ్మ నర్సింలు కూర సంతోష్ గాజులపల్లి నరసింహులు తదితరులున్నారు.



దోమకొండ పోలీస్‌స్టేషన్‌లో గ్రామ పంచాయతీ కార్మికులు

ఆయిల్‌పామ్ సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలి

- ఉద్యాన శాఖాధికారి సంధ్యారాణి

డిచ్‌పల్లి: ప్రభుత్వం ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న ఆయిల్‌పామ్ మొక్కల సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉద్యాన శాఖ అధికారి సంధ్యారాణి సూచించారు. ఆయిల్‌పామ్ తోటల విస్తీర్ణ పథకంలో భాగంగా మంగళవారం బీబీపూర్ శివారులోని నల్ల దినేష్‌రెడ్డికి చెందిన 8 ఎకరాల తోటలో మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ప్రీయూనిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ క్లస్టర్ అధికారి టి.భూమేష్, రైతులతో కలిసి సంధ్యారాణి ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆయిల్‌పామ్ పంట సాగుకు రాయితీ(సబ్సిడీ) ఇస్తుందన్నారు. ఆయిల్ పామ్ మొక్క ధర రూ.193 కాగా రైతు వాటా రూ.20 సబ్సిడీ పోను 50 మొక్కలకు రూ.8,650(యూనిట్) చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే ఆయిల్‌పామ్ పంట సాగుకు అవసరమైన డ్రిప్ ఇరిగేషన్ సిస్టమ్‌కు రూ.19,482లు ఉండగా ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, బీసీ, చిన్న, సన్నకారు రైతులకు రూ.90 శాతం ఇతర రైతులకు 80 శాతం సబ్సిడీ ఇస్తారని తెలిపారు. మొదటి నాలుగు సంవత్సరాలు అంతర పంటకు, అయిల్‌పామ్ తోట నిర్వహణ కోసం ఖర్చులకు రూ.4,200 నగదు రైతుల ఖాతాలో జమచేస్తామన్నారు. ఆసక్తి గల రైతులు ఉద్యానశాఖ అధికారికి దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.



మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ డ్రైవ్‌లో పాల్గొన్న సంధ్యారాణి, ఇతరులు

పొతంగల్‌లో వ్యక్తి దారుణహత్య



ఘటనాస్థలంలో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు



లాలయ్య (ఫైల్)

రుద్రూర్: పొతంగల్ మండల కేంద్రంలోని బీసీ కాలనీలో మేత్రి లాలయ్య అలియాస్ లాలబోయి(58) అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. సోమవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు కర్రలతో తలపై బాది హత్య చేసి పారిపోయారు. మంగళవారం ఉదయం స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న బోధన్ ఏసీపీ శ్రీనివాస్, రుద్రూర్ సీఐ జయేశ్‌రెడ్డి, కోటగిరి, వర్ని ఎస్సైలు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. లాలయ్య సోదరుడు మేత్రి పోశెట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వివిధ కోణాల్లో విచారణ

గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌పై డ్రైవర్‌గా పని చేసిన లాలయ్య కొంతకాలం క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. పక్షవాతం రావడంతో కొంత కాలంగా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఇద్దరు భార్యలు, ఐదుగురు సంతానం కాగా, హత్య జరిగిన రాత్రి వీరంతా మరో ఇంట్లో ఉండగా, లాలయ్య ఓ ఇంట్లో ఉన్నాడు. హత్య జరిగిన రాత్రి లాలయ్య వద్ద కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హత్యలో కుటుంబ సభ్యుల ప్రమేయం ఉందా? బయటి వ్యక్తులు హత్య చేశారా? అనే కోణాల్లో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. కుటుంబ సభ్యుల్లో ఇద్దరు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

దుకాణాల్లో షీటీం తనిఖీలు

రుద్రూర్: ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా మండల కేంద్రంలోని దుకాణాల్లో షీటీం సభ్యులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. మైనర్లను పనిలో పెట్టుకోవద్దని వ్యాపారులకు సూచించారు. షీటీం లీడర్ షాకియా, మమత, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, చైల్డ్ ఆఫీసర్ ముజీబ్ పాల్గొన్నారు.

ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వోపై ఫిర్యాదు

ఖలీల్‌వాడి: నగరంలోని మూడో కల్లు డిపో అక్రమాలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో దిలీప్ వారికి వత్తాసు పలుకుతున్నారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు నగరానికి చెందిన పలువురు వాట్సాప్‌లో ఫిర్యాదు చేశారు. బైలాస్‌కు విరుద్ధంగా వ్యవహరిస్తూ వేరే జిల్లా వారికి సభ్యులుగా అవకాశం కల్పించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. డిపో పరిధిలోని కల్లుదుకాణంలో మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్న ఎస్‌హెచ్‌వో కేసు నమోదు చేయలేదని, విషయం బయటికి రావడంతో ఆ తరువాత కేసు నమోదు చేశారని తెలిపారు. సమగ్ర విచారణ చేపట్టి ఎస్‌హెచ్‌వో దిలీప్‌తోపాటు మూడో డిపోపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

మద్యంకోసం వెళ్లి శవమయ్యాడు

ఖలీల్‌వాడి: వైన్‌షాప్‌నకు వెళ్లిన వృద్ధుడు నీటి గుంతలో పడి మృతి చెందిన సంఘటన నగరంలోని ఐదో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సాయినగర్‌కు చెందిన గంగారాం(65) ఆదివారం సాయంత్రం వైన్‌షాపునకు వెళ్తున్నా నని ఇంట్లో నుంచి బయటికి వెళ్లాడు.గంగారాం తిరిగిరాకపోవడంతో కు టుంబ సభ్యులు పలుచోట్ల వెతికి పోలీసులకు ఫిర్యాదు చేశారు.మంగళవారం భవన నిర్మాణ పనులకు వెళ్తున్న మేస్త్రీలు పనికి వెళ్తుండగా గుంత లో మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడిని గంగారాంగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఫిట్స్‌తో యువకుడు..

మాచారెడ్డి: ఫిట్స్ వచ్చిన యువకుడు నీటిగుంతలో పడి మృతి చెందిన సంఘటన పాల్వంచ మండలం ఇసాయిపేటలో చోటు చేసుకుంది. ఎస్సై అనిల్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన కోలాపురం రాజు (35) తండ్రి రాజయ్యతో కలిసి సోమవారం గ్రామ శివారులోని గుడ్డేలుగుల గుట్టకు పశువులను మేపేందుకు వెళ్లాడు. తండ్రి పశువులను తోలుకొని ముందు వస్తుండగా, రాజు వెనుక బయల్దేరాడు. ఇంటికి చేరుకున్న తండ్రికి తన కొడుకు కనిపించకపోవడంతో ఆందోళన గురయ్యాడు. గ్రామస్తులను వెంటబెట్టుకొని గుట్ట ప్రాంతానికి వెళ్లి గాలిస్తున్న క్రమంలో రాత్రి 11 గంటల ప్రాంతంలో ఓ నీటి గుంతలో రాజు మృతదేహం కనిపించింది. ఫిట్స్ రావడంతో నీటిగుంతలో పడి రాజు మృతి చెంది ఉంటాడని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

దుబాయిలో యువకుడి ఆత్మహత్య



నరేశ్ (ఫైల్)

మాచారెడ్డి: మండలంలోని సిక్కులోని లొద్ది తండాకు చెందిన ఓ యువకుడు దుబాయిలో ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. తండాకు చెందిన యువకుడు గుగులోత్ నరేశ్(23) ఉపాధి నిమిత్తం రెండేళ్ల క్రితం అప్పుచేసి దుబాయికి వెళ్లాడు. అక్కడ సరైన పని దొరకక పోగా, చేసిన పనికి డబ్బులు రాకపోవడంతో నరేశ్ మనస్తాపానికి గురయ్యాడు. అప్పులు తీర్చేమార్గం కనిపించకపోవడంతో మంగళవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కొడుకు మృతి వార్త తెలుసుకున్న నరేశ్ తల్లిదండ్రులు అరుణ, దేవ్ కన్నీరుమున్నీరవుతున్నారు. బాధిత కుటుంబా న్ని ఆదుకోవాలని తండావాసులు కోరుతున్నారు.

మద్యానికి బానిసై ..

ఎడపల్లి(బోధన్): మద్యానికి బానిసై మండలంలోని కుర్నాపల్లికి చెందిన మామిడి చిన్నసాయిలు (36) అనే వ్యక్తి మంగళవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై వంశీకృష్ణ రెడ్డి తెలిపారు. మద్యానికి బానిసైన చిన్నసాయిలు అనేక మంది అప్పులు చేయడంతోపాటు తరుచుగా భార్యను వేధించేవాడన్నారు. వేధింపులను భరించలేక అతడి భార్య పిల్లలతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయిందన్నారు. మద్యం మత్తులో ఇంట్లో ఉన్న చిన్నసాయిలు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు.